కథ

డా. తంగిరాల మీరాసుబ్రహ్మణ్యం

# మీకేవండీ!

వారం రోజులుగా కురుస్తున్న వర్షం తెరిపినిచ్చింది. వర్షం దెబ్బకే గుంతలు పడిపోయిన తారురోడ్ల మీద జాగ్రత్తగా బేలన్సు చేసుకుంటూ, బురదగా వున్న మట్టిరోడ్డుమీద జారిపోకుండా సర్కస్‌ఫీట్లు చేస్తూ స్కూటరుమీద క్షేమంగా ఇల్లుచేరిన మాధవమూర్తికి తాళం వేసిన తలుపు స్వాగతం పలికింది.

వారం రోజులుగా కాలక్షేపం కబుర్లకు మొహం వాచిపోయి వున్న అర్ధాంగి పారిజాతం, 'ఏ స్నేహితురాలి దుమ్ము దులపడానికి వెళ్లిందో' అనుకుంటూ లోపలికి నీరసంగా అడుగుపెట్టాడు మాధవమూర్తి.

'రివర్ వ్యూ కాలనీలోకి హంద్రీనీళ్లు వచ్చేసి కొన్ని ఇళ్లు మొదటి అంతస్తుదాకా మునిగిపోయాయిట. శకుంతలగారిని పలకరించి రావడానికి వెళ్తున్నా..టిఫిన్, కాఫీ సిద్ధంగా పెట్టాను. రాత్రికి కుక్కర్లో కాస్త బియ్యం కడిగిపెట్టండి, చాలు' అంటూ కాగితం రాసిపెట్టింది పారిజాతం.

పారిజాతం రివర్ వ్యూ కాలనీకి వెళ్లేసరికి శకుంతలగారింట్లోని ఫర్నిచర్ అంతా వీధిలోనే దర్శనమిచ్చింది. నాని పోయాయని ఎండపెట్టార్ట.

"మేడమీద వున్నాం. మెట్లెక్కి రండి" అంటూ పైనుండి పిలిచింది శకుంతలమ్మ.

క్రింది ఇల్లంతా తడిసిపోవడం వలన మేడమీదికి మారారుట.

"కర్నూల్లో ఇలా ఊళ్లోకి నీళ్లు రావడం కనీవిననివింత సుమండీ! ఫ్రిజ్, టీవీ, అన్నీ నానిపోయాయా? పరుపులూ, బట్టలూ, పనికొస్తాయా?" పరామర్శగా అడిగింది పారిజాతం.

"బీరువాలోకి కూడా నీళ్లొచ్చేసి చీరెలన్నీ నానిపోయాయి. రంగులు కలగాపులగంగా అన్ని చీరెలకూ అంటుకున్నాయి" అని ముందుగా ముఖ్యమైన సంగతి చెప్పి దిగులుపడింది శకుంతలమ్మ.

"పరుపులు పనికిరావనుకుంటాను. మిక్సీ చెడిపోయింది. టి.వి., ఫ్రిజ్ రిపేరుకిచ్చాం. మంచాలు, పరుపులూ, సోఫాలూ, ఏమీ లేకుండా ఈ నాలుగు రోజులుగా మేడమీద కాలక్షేపం చేస్తున్నాం. తెలిసినవాళ్లు కేరియర్లో భోజనం పంపించారు. ఇవాళ మళ్లీ వంట మొదలుపెట్టాను" నష్టాన్ని తలచుకుంటూ నీరసంగా మళ్ళీ చెప్పింది శకుంతలమ్మ.

"ఏమయినా మీకేవండీ అదృష్టవంతులు..ఇంటిమీద మేడ కట్టుకున్నారు గనుక అంత వరదొచ్చినా మీ ఇంట్లో మీరున్నారు. అదే మా బిక్కాంపులోకి ఇలా నీళ్లొస్తే మేము కొట్టుకుపోయి వుండేవాళ్లం. మా ఇళ్లన్నీ రోడ్డు లెవెల్‌కే వున్నాయి. పైగా మీలాగా తెలివిగా మేడమీద ఇల్లు కట్టుకోలేదు మేము" అంది ఓదార్పుగా పారిజాతం.

శకుంతలమ్మ తెల్లబోయి చూసింది. ఏమి మాట్లాడాలో తోచనట్టు పూరుకుంది.

పారిజాతం ఇంటికొచ్చాక మొగుడికి విశేషాలన్నీ వివరంగా వినిపించింది.

పదిహేనురోజులు గడిచాయి. ఆరోజు మాధవమూర్తి కాస్త ఆలస్యంగా ఇంటికొచ్చాడు. వీధిగుమ్మంలోనే ఎదురై

"ఇవాళ పేపర్లో వేసారు చూసారా?" అడిగింది పారిజాతం. "మీ ఆఫీసులో పనిచేసే సుదర్శనంగారింట్లో నిన్న దొంగలుపడ్డార్ట"

"పేపరు చూడలేదు. ప్రొద్దున్న తొందరగా వెళ్లిపోయాను కదా ఆఫీస్‌కి. ఆఫీస్‌లో సుదర్శనం కనబడలేదు. నాతో ఎవరూ ఈ మాట అనలేదు" అన్నాడు మాధవమూర్తి.

"పాపం కష్టంలో వున్నప్పుడు పలకరించి రావడం మన ధర్మం. పదండి వెళ్లి చూసొద్దాం" అంటూ మొగుడిని బయలుదేరదీసింది పారిజాతం.

వీళ్లు వెళ్లేసరికి విషణ్ణ వదనాలతో కూర్చుని కనిపించారు సుదర్శనం, అతని భార్య వల్లి.

"రెండ్రోజులు ఇంటికి తాళంపెట్టి వెళ్లేసరికి ఎంత పనయింది చూడండి. దగ్గరివాళ్ల పెళ్లి. తప్పనిసరిగా వెళ్లాల్సి వచ్చింది. తాళం వేసే వెళ్లాం" అన్నారు. ఇల్లు పాతకాలం నాటిదిలా వుంది.

"అయ్యో! టి.వి. టేపురికార్డరు, డివిడి ప్లేయరు, అన్నీ పట్టుకెళ్లారా? ఎంతన్యాయం: నగలుగాని ఇంట్లో పెట్టి వెళ్లారా కొంపదీసి" సానుభూతి చూపిస్తూ ఆదుర్దాగా అడిగింది పారిజాతం.

"అదృష్టంకొద్దీ ఇంట్లో బంగారం వస్తువులేవీ వదలేదు" అంది వల్లి.

"నేను సరదాపడి, పోయిన సంవత్సరం కొనుక్కున్న లాప్‌టాప్ కూడా పోయింది. గుడ్డిలోమెల్ల ఏమంటే ఇంట్లో వస్తువులన్నిటిమీద ఇన్సూరెన్స్ తీసుకున్నాను" నిట్టూరుస్తూ చెప్పాడు సుదర్శనం.

"మీకేవండీ! దొంగలుపడినా పాతబడిన వస్తువులేగా పట్టుకుపోయ్యారు! ఇన్సూరెన్స్ డబ్బుతో అన్నీ కొత్తవస్తువులు కొనుక్కోవచ్చు" అంది పారిజాతం.

తెల్లబోయి చూశారు సుదర్శనం దంపతులు.

* * *

పారిజాతం చెల్లెలి మొగుడు స్కూటరు మీద నుండి క్రిందపడి కాలు ఫ్రాక్చరయిందని ఫోన్ వచ్చింది.

వెళ్లి మరిదిని పరామర్శించి చెల్లెలికి ధైర్యం చెప్పి వచ్చింది పారిజాతం.

మూర్తికి ఆరువారాల తరువాత కట్టువిప్పారు. విరిగిన ఎముక బాగానే అతుక్కుందిగాని కొన్నాళ్లపాటు క్రచెస్ వాడాలని చెప్పార్ట.

మొగుడికి కాళ్లు బాగుపడితే కొండకొస్తానని మొక్కుకుంది పారిజాతం చెల్లెలు మల్లిక.

"క్యూలో ఎంతసేపు నిలబడాల్సి వస్తుందో...ఆయనకు అంతసేపు నిలబడటం చేతనవుతుందోకాదో అని టెన్షన్ పడ్డానక్కా. నిజంగా దేవుడి దయ! ఈయన క్రచెస్‌తో నడవటం చూసి, ఆయన్నూ ఆయనతోపాటుగా నన్నూ నేరుగా లోపలికి పంపించేశారక్కా. గంటలో దర్శనం చేసుకుని బయటపడ్డాం!" అంది మల్లిక.

"మీకేమిటే ఫ్రాక్చరయినా ఆరువారాల్లో అతుక్కుంది. గంటల తరబడి క్యూలో నిలబడనక్కర్లేకుండా స్పెషల్ దర్శనంలో స్వామిని చూసి వచ్చావు" అంది పారిజాతం.

మల్లిక మరేమీ మాట్లాడలేదు.

* * *

మాధవమూర్తి తల్లిదండ్రులు అతని అన్నగారు శేఖరం దగ్గర వుంటారు. వారి పెళ్లయి యాభై సంవత్సరాలు దాటిన సందర్భంలో చిన్నపండుగలాగ జరుపుతున్నామనీ తప్పక రమ్మనీ మాధవమూర్తినీ పారిజాతాన్నీ ఆహ్వానించాడు శేఖరం.

"వాళ్ల అదృష్టమే అదృష్టం" అంటూ, అత్తగారికి చీరె, మామగారికి పంచెలచాపు కొన్నది పారిజాతం.

"ఈ వయస్సులో మాకీ వేడుకలేమిటమ్మా అన్నా వినలేదు మీ తోడికోడలు" అంది పారిజాతం అత్తగారు, బట్టలు చదివించి కాళ్లకు నమస్కారం చేస్తున్న చిన్నకోడలితో.

"అన్నయ్య మంచిపని చేశాడు. ఈ వంకన అందరం కలిసి ఇలా పండుగ జరుపుకోవడం ఎంతో బాగుంది" అన్నాడు మాధవమూర్తి.

"మీకేవండీ! మావయ్యగారు పదిహేనేళ్లుగా పెన్షన్ తీసుకుంటున్నారు. మీరు కళ్లద్దాలు లేకుండానే టి.వి.లో సినిమాలు చూస్తారు. మీ వయసువచ్చేసరికి మేము ఎలా వుంటామో! అసలు వుంటామో వుండమో" అంది పారిజాతం.అంతవరకూ నవ్వుతో వెలిగిపోతున్న అత్తగారి ముఖంలో నవ్వు మాయమయింది.

* * *

ఉన్నట్టుండి ఒకరోజున కళ్లు తిరిగి పడిపోయింది పారిజాతం.

కంగారుపడి ఆవిడను హాస్పిటల్‌కు తీసుకు వెళ్లిన మాధవమూర్తికి ఆయాసమూ గుండె దడా రావడం వల్ల, అతన్నీ అడ్మిట్ కమ్మన్నారు, హాస్పిటల్లో.

రెండో రోజున ఇద్దర్నీ ఇంటికి పంపిస్తూ "పారిజాతం రక్తంలో చక్కెర శాతం చాలా వుందనీ ఖచ్చితంగా ఆహార నియమాలు పాటిస్తూ మందులు వాడాలనీ" చెప్పారు. మాధవమూర్తికి హార్ట్ ఎన్‌లార్జ్‌మెంట్ కనబడుతున్నదనీ, బి.పి.ఎక్కువగా వున్నదనీ విశ్రాంతిగా వుండాలనీ చెప్పారు డాక్టర్లు.

ఇంకో ఎనిమిది సంవత్సరాల సర్వీసువున్నా వాలంటరీ రిటైర్మెంట్‌కు అప్లై చేశాడు మాధవరావు. పిల్లాడి చదువూ, పిల్లపెళ్లీ అయిపొయ్యాయి గనుక టెన్షన్‌తో కూడిన ఉద్యోగం చేయడం అనవసరం అనిపించిందతనికి.

పారిజాతాన్ని చూడటానికి శకుంతలమ్మ వచ్చింది.

"కళ్లు తిరిగి పడిపోయేదాకా మీకు షుగర్ వున్నట్టు తెలియలేదా పాపం! షుగర్ కంప్లైంట్ వున్నవాళ్లు సన్నగా అయిపోతారు. మీకే వండీ, వాకింగూ, ఎక్సర్‌సైజులూ బాధలేకుండా చక్కగా స్లిమ్‌గా తయారవుతారు" అన్నదామె.

పారిజాతానికి నోట మాట రాలేదు.

ఆ మర్నాడు పలకరించడానికి వచ్చింది వల్లి.

"మీకు షుగరూ ఆయన బి.పి. ఒకేసారి వచ్చాయిట కదా పాపం! అయినా మీకేం లెండి. ఇక మీదట మీరు పచారీసామానుల ధరలు మండిపోతున్నాయి ఎలా కొనుక్కోవడమా అని దిగులు పడనక్కర్లేదు. మీరు స్వీట్లు తినకూడదు. ఆయన నూనె వస్తువులకు దూరం. ఖర్చు తప్పింది" అని ఓదార్చింది.

పారిజాతానికి చెమటలు పట్టాయి.

మల్లిక అక్కను చూడ్డానికి వచ్చింది. "నీకు షుగర్ తోబాటు బి.పి.వున్నా, బావకు బి.పి.తో పాటు షుగర్ వున్నా ప్రమాదమయ్యేది. మీకేమిటే చిన్న వయసులో పిల్లలిద్దరూ జీవితంలో స్థిరపడ్డారు. బావ వాలంటరీ రిటైర్మెంట్ తీసుకుని ఇంట్లోనే వుంటారు. పెళ్లైన కొత్తలోలాగా చిలుకాగోరింకల్లా వుండొచ్చు. నువ్వేమన్నా బొబ్బట్లు చేయాలా గారెలు వండాలా? పథ్యం వంట ఎంత సేపు గనుక" అంది.

పారిజాతానికి ఏం జవాబు చెప్పాలో తెలియలేదు.

మాధవమూర్తి తల్లీ చెల్లెలూ వీళ్లని చూడడానికి వచ్చారు.

"కాస్త కఠినంగా పథ్యం చేస్తే తగ్గని జబ్బులు కాదు లేమ్మా. దిగులు పడకు" అంది అత్తగారు ధైర్యం చెబుతూ.

"మా నాన్నగారు అరవైఏళ్లదాకా ఆఫీసులో చాకిరీ చేసి రిటైరయ్యారు. అన్నయ్యా యాభై రెండేళ్లకే వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నాడు. మీకేంలే వదినా, ఇద్దరూ కూర్చుని పెన్షన్ డబ్బుతో బ్రతికేయవచ్చు. ఆరోగ్యం జాగ్రత్త వదినా" అంది మాధవమూర్తి చెల్లెలు.

మాధవమూర్తి భార్యవైపు చూశాడు.

పారిజాతం తలవంచుకుని కూర్చుంది.

